క్లుప్తంగా

‘రైతు భరోసా’కు దరఖాస్తుల ఆహ్వానం

మదనాపురం: మండలంలో 1 జనవరి, 2025 లోపు కొత్తగా పట్టా పాసుబుక్ వచ్చిన వారు రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ అనిత ఒక ప్రకటనలో కోరారు. అదే విధంగా బ్యాంకు అకౌంట్ మార్చుకునే రైతులు దరఖాస్తు చేయాలన్నారు. పట్టాదారు పాసుబుక్ జిరాక్స్, ఆధార్ జిరాక్స్, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ కాపీలను తీసుకొని మదనాపురం వ్యవసాయ కార్యాలయంలో ఇవ్వాలని సూచించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగ పర్చుకోవాలన్నారు.

విద్యార్థిని అదృశ్యం: కేసు నమోదు

ఖిల్లాఘనపురం: కళాశాలకు వెళ్లిన విద్యార్థిని తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన ఖిల్లాఘనపురంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సోళీపురం గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. బుధవారం కళాశాలకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన విద్యార్థిని సాయంత్రం ఇంటికి తిరిగి రాలేదు. కళాశాలకు ఫోన్ చేసి అడగగా కళాశాలకు రాలేదని అధ్యాపకులు తెలిపారు. సోళీపురం గ్రామానికి చెందిన కుమార్‌పై అనుమానం ఉన్నట్లు విద్యార్థిని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ బొట్టు శ్రీనివాసులు తెలిపారు.

విరాళం అందజేత

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ ఆలయంలో శ్రీకృష్ణుడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచుపల్లి యాదవ్ తనవంతు సహాయంగా రూ.50వేలు ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఆలయ అభివృద్ధి కోసం దాతలు ముందుకు రావాలని, త్వరలోనే విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పెండెం శంకర్‌యాదవ్, బాలకొండ యాదవ్, పెంటన్న యాదవ్, కదిరి సాయిలుయాదవ్, రాములు యాదవ్, తిమ్మన్నయాదవ్, రాయిణిపేట పాండురంగయ్య తదితరులు ఉన్నారు.

ఆంగ్లంపై పట్టు సాధించాలి

గోపాల్‌పేట: విద్యార్థులు ఇంగ్లిష్, గణితం సబ్జెక్టుల్లో పట్టు సాధిస్తే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఏదుల మండల ఎంఈఓ ప్రభాకర్ అన్నారు. గురువారం ఆయన ఏదుల మండలంలోని మూడు, నాలుగు, ఐదో, ఆరు, ఏడో తరగతి విద్యార్థులకు ట్యాలెంట్ పరీక్ష నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎంపిక చేశారు. జూనియర్ విభాగంలో ముగ్గురు, సీనియర్ విభాగంలో ముగ్గిరిని ఎంపిక చేశామని, రిపబ్లిక్ డే రోజు బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. విద్యార్థుల్లో ప్రతిభ గుర్తించేందుకు ఈ పరీక్ష నిర్వహించామని తెలిపారు.

టాం టాం లేకుండా వార్డు సభలేంటి?

వనపర్తి టౌన్: స్థానిక మున్సిపాలిటీలో మూడు రోజుల పాటు జరిగిన వార్డు సభలు గురువారంతో ముగిశాయి. జిల్లా కేంద్రంలోని 24వ వార్డు నుంచి 33వ వార్డులో అధికారులు, కౌన్సిలర్లు వార్డు సభలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్లు వాకిటి శ్రీధర్, అలేఖ్య తదితరులు ఆయా వార్డు సభల తీరు, అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. టాం టాం ద్వారా ప్రచారం చేయకుండా సభలు నిర్వహిస్తే ప్రజలకు ఎలా తెలుస్తుందని అధికారులను నిలదీశారు. ఇప్పటికే మూడు పర్యాయాలుగా దరఖాస్తులు స్వీకరించారని, ఇంకా దరఖాస్తులు తీసుకుంటున్నారని అధికారుల తీరుపై మండిపడ్డారు. ఆయా వార్డులో జరిగిన సభలో మున్సిపల్ చైర్మన్ మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, కమిషనర్ పూర్ణచందర్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిరంతర ప్రక్రియ అని, అర్హులందరికీ లబ్ధి చేకూరుతుందన్నారు. గురువారం ఇందిరమ్మ ఇళ్లకు 448, రేషన్ కార్డులకు 657 మంది లబ్ధిదారులను ప్రకటించినట్లు అధికారులు తెలిపారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం



వనపర్తి రూరల్: మండలంలోని కాశీంనగర్, రాజపేట గ్రామాల్లో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ కోఆర్డినేటర్ మస్తానయ్య, బీచుపల్లి ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక అక్షరాస్యత, సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఏటీఎం పిన్, సెల్‌ఫోన్లకు వచ్చే లింక్‌లు, ఓటీపీ వివరాలను ఎవరికీ చెప్పరాదని, సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దని సూచించారు. ఎవరైనా ఆన్‌లైన్ మోసాలకు గురైతే 1930 నంబర్‌కి సంప్రదించాలని సూచించారు.



ఈదులబాయితండాలో..



ఖిల్లాఘనపురం మండలం అప్పారెడ్డిపల్లిలో..

సంక్షేమ పథకాలకు దరఖాస్తుల వెల్లువ

సాక్షి, నెట్‌వర్క్: వనపర్తి మండలంలోని అంకూర్, చందాపూర్, కాశీంనగర్, రాజపేట, వెంకటాపురం గ్రామాల్లో గురువారం ప్రత్యేక అధికారులు గ్రామసభలు నిర్వహించారు. అధికారులు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల జాబితాను గ్రామసభలో చదివి వినిపించారు. అందరి దృష్టి ఇందిరమ్మ ఇళ్లపైనే ఉండడంతో.. జాబితాలో పేర్లు రాని అర్హులు నిరుత్సాహానికి గురై అధికారులతో వాగ్వాదానికి దిగారు. రాజపేట, కాశీంనగర్ గ్రామాల్లో జాబితాలో పేర్లు లేని అర్హులు సభకు ఆటకం కల్గించారు. కార్యక్రమంలో ఎంపీఓలు రవీంద్రబాబు, స్వాతి, భాస్కర్, ప్రదీప్ రెడ్డి, ఆర్‌ఐలు మధుసూదన్, వెంకటేష్, ఏఈఓలు విజయలక్ష్మి, ప్రభావతి, శ్రీకాంత్, కవిత, వంశీ తదితరులు పాల్గొన్నారు.



సంగినేనిపల్లిలో అనర్హులను తొలగించాలని కోరుతున్న గ్రామస్తులు

● కొత్తకోట మండలంలోని అప్పరాల, చర్లపల్లి, వడ్డెవాట, ఈదులబాయితండా, రామకృష్ణాపూర్, పాతజంగమాయపల్లి గ్రామాల్లో అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలను చదివి వినిపించారు. మండలంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎక్కువగా దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ చెన్నమ్మ తెలిపారు.

● ఖిల్లాఘనపురం మండలంలో మూడు రోజులు ఇందిరమ్మ ఇళ్ల కోసం గతంలో వచ్చిన దరఖాస్తులు కాకుండా 443 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓ వెంకటాచారి చెప్పారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 232, రేషన్ కార్డులకు 1,160, రైతు భరోసా కోసం 42 మంది దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో తహసీల్దార్ సుగుణ, ఏఓ మల్లయ్య, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● పాన్‌గల్ మండల కేంద్రంతో పాటు చిక్కేపల్లి, దావాత్‌ఖాన్‌పల్లి, గోప్లాపూర్, జమ్మాపూర్, మాందాపూర్, మంగళ్లపల్లి, రాయినిపల్లి, శాగాపూర్ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితా వివరాలను వెల్లడించారు. మండలంలోని మాందాపూర్, శాగాపూర్ తదితర గ్రామాల్లో సంక్షేమ పథకాలల్లో అర్హుల పేర్లు రాని వారు అధికారులను నిలదీశారు. ఈ తొమ్మిది గ్రామాల్లో రేషన్‌కార్డులకు 490, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 169, ఇందిరమ్మ ఇళ్లకు 303 కలిపి మొత్తం 962 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ గోవింద్‌రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ రాజవర్ధన్‌రెడ్డి, డీటీ అశోక్‌నాయుడు, ఎంపీఓ రఘురాములు, ఆర్‌ఐలు మహేష్, తిరుపతయ్య, వ్యవసాయశాఖ ఏఈఓలు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● మదనాపురం మండలంలోని కొత్తపల్లి, శంకరమ్మపేట గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించగా.. ఇందిరమ్మ ఇంటి కోసం 28, రేషన్ కార్డులకు 62, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 17 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓ ప్రసన్న కుమారి తెలిపారు.

అనర్హుల పేర్లు జాబితాలో..

వీపనగండ్ల మండలంలోని పుల్గర్‌చర్ల, సంగినేనిపల్లి గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం అందజేసే ఆర్థికసాయానికి సంబంధించిన పేర్లలో ఉపాధి పనికి వెళ్లని వారి పేర్లు, పొలం ఉన్న వారి పేర్లు ఉండడంతో స్థానికులు నిరసనను తెలియజేశారు. ఈ విషయమై సంగినేనిపల్లి గ్రామంలో ప్రత్యేకాధికారి ఎంపీడీఓ శ్రీనివాసరావు జాబితాను రద్దు చేసి తిరిగి అర్హుల నుంచి దరఖాస్తులు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చాడు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి, ఆర్‌ఐ కురుమూర్తి, పంచాయతీ కార్యదర్శులు శ్యాం, నాగరాజు, కాంగ్రెస్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, ఇంద్రకంటి వెంకటేష్, ధనుంజయ్య, విజయభాస్కర్‌రెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



కాశీంనగర్‌లో మాట్లాడుతున్న ఆర్‌ఐ



పాన్‌గల్ మండలం గోప్లాపూర్‌లో..



శంకరమ్మపేటలో..

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

అమరచింత: అర్హులైన ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి అబ్రహం మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఆయా వార్డుల్లో జరిగిన సభలు నామమాత్రంగా నిర్వహించినట్లు ఆందోళన వ్యక్తం చేశారు. నిజమైన పేదలకు ఇళ్లు మంజూరు కాలేదని, ఇంతక ముందే ఇల్లు ఉన్న వారికే ఇళ్లను కేటాయించారని అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మున్సిపల్ అధికారులు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వపోతే మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ మెనేజర్ ఇసూప్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో భాస్కర్, రఘు, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని ఎంపీకి వినతి



మదనాపురం: స్థానిక రైల్వేస్టేషన్‌లో చెన్నై, యశ్వంత్‌పూర్‌తో పాటు ప్రత్యేక రైళ్లు ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు, మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డితో కలిసి ఎంపీ డీకే అరుణకు గురువారం వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో ఏకైక పెద్ద రైల్వేస్టేషన్ కాబట్టి ఈ ప్రాంత ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని కోరారు. ఇక్కడ ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాప్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు స్కాలర్స్ విద్యార్థులు

వనపర్తి టౌన్: నల్గొండ జిల్లాలో ఈ నెల 6 నుంచి 9వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో స్కాలర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు మమత, అర్జున్ టెండూల్కర్ పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.శ్రీధర్ తెలిపారు. ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 2వరకు జార్ఖండ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి హాకీ పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని ఫిజికల్ డైరెక్టర్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. విద్యార్థులు జాతీయ స్థాయి హాకీ పోటీల్లో ప్రతిభ కనబర్చి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని కళాశాల యాజమాన్యం డాక్టర్ జగదీశ్వర్, వరప్రసాద్‌రావు, బి.నాగేశ్వర్‌రెడ్డి, ఎల్.సత్యనారాయణరెడ్డి ఆకాంక్షించారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం, లెక్చరర్లు

చెరుకు రైతులను ఆదుకోవాలి

అమరచింత: చెరకు రైతులకు శాపంగా మారిన రికవరీ విధానం రద్దు చేసి ఆదుకోవాలని ఎంపీ అరుణకు వినతిపత్రం అందించామని కృష్ణవేణి చెరుకు రైతు సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి రాజన్న తెలిపారు. కేంద్ర ప్రభుత్వ రికవరీ విధానం సాకుతో కృష్ణవేణి యాజమాన్యం చెరుకు రైతులను నష్టపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి చెరుకు రైతులకు టన్నుకు రూ.3,366 చెల్లిస్తూ జహీరాబాద్ నుంచి తెప్పించుకుంటున్న చెరుకుకు రూ.4,250 ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. స్థానిక రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని తమకు న్యాయం చేయాలని ఎంపీకి విన్నవించారు. కార్యక్రమంలో చెరుకు రైతు సంఘం నాయకులు వాసారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, నారాయణ, రంగారెడ్డి, భగవంతు పాల్గొన్నారు.

క్షయ నివారణకు పాటుపడుదాం

ఆత్మకూర్: క్షయవ్యాధి నివారణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని, లక్షణాలు ఉన్న వారికి వైద్య పరీక్షలు చేయించాలని వైద్యులు నందకిషోర్, వసంత, జిల్లా టీబీ టీం ఆరోగ్య పర్యవేక్షకుడు సురేందర్‌గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని జూరాల పంచాయతీ కార్యాలయంలో వంద రోజుల టీబీ కార్యక్రమంలో భాగంగా 69 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి.. ముగ్గురికి టీబీ లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. రెండు వారాలకు మించి తెమడతో కూడిన దగ్గు, అలసట, నీరసం, రాత్రిపూట చెమటలు పట్టడం, శరీరభాగాల్లో వాపు, దగ్గినప్పుడు ఛాతిలో నొప్పి వస్తున్నా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. పీహెచ్ ప్రమీల, ఆరోగ్య కార్యకర్త అనంతమ్మ, ఆశా కార్యకర్తలు గోపాలమ్మ, సత్యమ్మ, పద్మ, భాగ్యమ్మ, వైద్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సేవాభావంతోనే సమాజ అభివృద్ధి

మదనాపురం: ఉపాధ్యాయులు కేవలం పాఠ్యాంశం బోధనలకు మాత్రమే పరిమితం కాకుండా సేవ కార్యక్రమాలను చేపట్టడం అభినందించదగ్గ విషయని జిల్లా ప్లానింగ్ కమ్యూనిటీ కోఆర్డినేటర్లు శేఖర్, యుగంధర్ పేర్కొన్నారు. గురువారం మదనాపురం మండలంలోని దుప్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 203 మందికి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ తన సొంత డబ్బులతో టై, బెల్ట్, బ్యాడ్జీలు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. హెచ్‌ఎంను ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ షేక్‌ఫరూక్ హుస్సేన్, ఉమా దేవి, సుధామని తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు సాగునీరు అందిస్తాం

కొత్తకోట రూరల్: భీమా ప్రాజెక్టులో భాగమైన శంకరసముద్రం రిజర్వాయర్ చివరి ఆయకట్టు పొలాల వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు కిసాన్ కాంగ్రెస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నీటిపారుదల శాఖ ఈఈ కేశవరావు, డీఈ ఎల్లస్వామిని తీసుకెళ్లి శంకరసముద్రం రిజర్వాయర్‌ను పరిశీలించారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారంగా పర్యవేక్షించి యాసంగి పంట సాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పంట సాగు వేసిన రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎమ్మెల్యే సహకారంతో పంటలకు పూర్తి స్థాయిలో నీటిని అందించేందుకు కృషి చేస్తామని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి, రమణ, కోటీశ్వర్‌రెడ్డి, యాదగిరి, సాయిల్‌గౌడ్, రైతులు ఆకుల శ్రీనివాసులు, నాగేశ్వర్‌రెడ్డి, రామకృష్ణ, వెంకటన్న, రమేష్, బి.వెంకటన్న, దేవన్న ఉన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

వనపర్తి రూరల్: చేపల వేటకు వెళ్లి చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం వనపర్తి శివారులోని మెట్టుపల్లిలో చోటు చేసుకుంది. వనపర్తి పట్టణ ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మెట్టుపల్లి గ్రామానికి చెందిన బోలెమోని వెంకటేశం (46) గురువారం గ్రామంలోని నీలమానికుంట వద్ద చేపల వేటకు వెళ్లగా.. కాళ్లకు వల చుట్టుకొని నీటిలో పడిపోయాడు. అటుగా వెళ్తున్న గోకం బాలరాజు విషయాన్ని బాధితుడి ఇంటికి వెళ్లి భార్య సువర్ణకు విషయం చెప్పాడు. ఆమె కుంట వద్దకు వెళ్లి చూడగా వలల్లో చుట్టుకొని నీటిలో కనబడిన భర్తను వనపర్తి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు వనపర్తి పట్టణ ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు.

నేతాజీ ఆశయ సాధనకు నడుం బిగించాలి



వనపర్తిలో సుభాష్‌చంద్రబోస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

వనపర్తి టౌన్: దేశ స్వాతంత్ర్యమే లక్ష్యంగా సాయుధ పోరాటానికి నడుం బిగించిన నేతాజీ సుభాష్‌చంద్రబోస్ స్ఫూర్తి చరిత్రలో చెరగని మైలురాయి అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దుప్పల్లి నారాయణ, మహనీయుల స్ఫూర్తి వేదిక రాష్ట్ర కన్వీనర్ రాజారాం ప్రకాష్ అన్నారు. నేతాజీ జయంతి వేడుకలను బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ కార్యాలయంలో, మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాలలో నేతాజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీశైలం, పురుషోత్తంరెడ్డి, జ్యోతి, మధు, పెద్దిరాజు, సీతారాములు, గిరిరాజాచారి, మండ్ల దేవన్న, బండలయ్య, బాలేమియా, కృష్ణయ్య, పరమేశ్వరచారి, కరుణాకర్‌శెట్టి, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని నాగపూర్‌లో నాగం కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుభాష్ చంద్రబోస్ దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను అర్పించాడని కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని యువకులు దేశం కోసం పాటుపడాలని చెప్పారు. కార్యక్రమంలో నాగం ప్రతాప్‌రెడ్డి, పాపులు, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రయ్య, సుల్తాన్ అలీ, గ్రామస్తులు పాల్గొన్నారు.



నాగపూర్‌లో..

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



కొత్తపేటలో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సీఆర్పీలు



నాగల్‌కడ్మూర్‌లో..

పాన్‌గల్: బడిఈడు పిల్లలను బడుల్లో చేర్పించాలని సీఆర్పీలు విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. బడిఈడు పిల్లల గుర్తింపు కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని అన్నారం, అన్నారం తండా, గోప్లాపూర్, కొత్తపేట గ్రామాల్లో బడిబయట పిల్లల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్పీలు మాట్లాడుతూ ఆరేళ్ల నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలందరిని బడికి పంపించాలని కోరారు. వారిచే పనులు చేయిస్తే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని, చదువుకుంటే కలిగే లాభాలు, ప్రయోజనాలు తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో సీఆర్పీలు గోవింద్‌నాయక్, రమాదేవి, భార్గవి, ఐఈఆర్పీ సంతోష్ పాల్గొన్నారు.

అమరచింత: బడి బయటి విద్యార్థులందరూ బడిలో ఉండాలని సీఆర్పీ స్వామి అన్నారు. బడి బయటి విద్యార్థుల గుర్తింపు కార్యక్రమంలో భాగంగా గురువారం నాగల్‌కడ్మూర్ గ్రామంలో బడి మానిన విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి చదువు యొక్క ప్రాముఖ్యత గురించి తల్లితండ్రులకు వివరించారు. బడిమాని మట్టి పనులకు వలస వెళ్తున్న నవీన అనే విద్యార్థినిని బడిలో చేర్పించేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

ఎంఎస్‌ఎఫ్ ఉద్యమానికి మద్దతివ్వండి

వీపనగండ్ల: ఏ, బీ, సీ, డీ వర్గీకరణ సాధన కోసం అసెంబ్లీ సాక్షిగా మాట ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం దానిని అమలు చేయడంతో నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని, అందుకు నిరసనగా వెయ్యి గొంతులు లక్ష కత్తుల మహాప్రదర్శన రథయాత్ర కార్యక్రమాన్ని వచ్చే నెల 7వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నామని ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మొలుకలపల్లి పరశురాములు అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఈ రథయాత్ర ద్వారా మాదిగలను చైతన్యపరుస్తున్నామని, ఈ నెల 25న మండల కేంద్రానికి ఈ రథయాత్ర తీర్పు ఉంటుందని, కార్యక్రమంలో అధిక సంఖ్యలో మాదిగలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాగరాజు, పాముసాగులు, ప్రవీన్, విష్ణు, అభిషేక్, శ్రీరాం, వినోద్, రాము తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎస్‌ఎఫ్ నాయకులు

రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా బీజేపీ పాలన



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

వనపర్తి టౌన్: రాజ్యాంగానికి ప్రతీకగా బీజేపీ పాలన కొనసాగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దుప్పల్లి నారాయణ అన్నారు. బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సంవిధాన్, అభియాన్ యాత్రలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని గిరిజన ప్రాంతంలో రాజ్యాంగ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌కు నివాళుర్పించారు. రాజ్యాంగాన్ని అబాసుపాలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ ముందంజలో ఉందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసి ఏడాది కాలం పూర్తవుతున్నా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి బి.శ్రీశైలం, పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, నవీన్‌చారి, ఎద్దుల రాజు, లింగేశ్వర్, గోవింద్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

‘సురక్షిత ప్రయాణం మన చేతుల్లోనే’

ఆత్మకూర్: సురక్షిత ప్రయాణం మన చేతుల్లోనే ఉందని, ప్రతి ఒక్కరూ రోడ్డు నియమాలను పాటిస్తూ వాహనాలు నడపాలని జిల్లా అసిస్టెంట్ ఎంఈవై సైదులునాయక్ అన్నారు. గురువారం స్థానిక శ్రీవాణి హైస్కూల్‌లో రోడ్డు భద్రత వారోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రయాణికులు క్షేమంగా తమ ఇళ్లకు చేరేందుకు పాటిచాల్సిన జాగ్రత్తను గుర్తు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో ఏడాదికి 1.60లక్షల మరణాలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కళాజాత బృందం చేత పాటల ద్వారా అవగాహన కల్పిచారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ టీజే విశ్వేశ్వర్, ప్రిన్సిపల్ గంగాధర్, డ్రైవర్లు,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అసిస్టెంట్ ఎంఈవై సైదులునాయక్

షాదీఖానాకు నిధులు మంజూరు చేయండి



ఎమ్మెల్యే శ్రీహరికి వినతిపత్రం ఇస్తున్న జామియా మసీదు కమిటీ సభ్యులు

అమరచింత: పట్టణంలోని షాదీఖాన అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి గురువారం హైదరాబాద్‌లో వినతిపత్రం అందించామని జామియా మసీదు కమిటీ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్ తెలిపారు. ప్రస్తుతం షాదీఖానా మరమ్మతుకు నోచుకోకపోవడంతో నిరుపయోగంగా మారడంతో.. భవనం అక్కడక్కడ నెర్రెలు వారిందన్నారు. అధునాతనమైన షాదీఖాన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తే.. వీటి ద్వారా వచ్చే ఆదాయంతో మసీదు నిర్వహణతో పాటు షాదీఖాన అభివృద్ధి చెందుతోందన్నారు. దీంతో ఎమ్మెల్యే స్పందిస్తూ నిధుల మంజూరుకు తనవంతు కృషి చేస్తున్నట్లు హామీ ఇచ్చారని కమిటీ సభ్యులు తౌఫిక్, అసూ, దస్తగిర్, షాషా తదితరులు తెలిపారు.